పత్రికా ప్రకటన

ఏప్రిల్ 25, 2017

**అన్నదాతల ప్రయోజనం కోసం ఎరువుల కొనుగోలుకు ఆర్థిక సహాయంగా ఎకరాకు రూ. 4000 లను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం పట్ల దక్కన్ డెవలప్ మెంట్ సొసైటీ (డీడీఎస్) హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తోంది.**

**సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ పరిసరాల్లోని అతి సామాన్య మహిళా రైతులు అయిదు వేలమందికి మూడు దశాబ్దాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ డీడీఎస్ఆ వేలాది మంది మహిళా రైతుల తరఫున ప్రభుత్వ నిర్ణయం అపూర్వమైనదిగా ప్రశంసలు అందిస్తున్నది.** తెలంగాణలోని సన్న. చిన్న కారు మహిళా రైతులకు సుందర, సుస్థిరమైన భవిష్యత్ అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరి కొన్ని ముందడుగులు వేసేందుకు డీడీఎస్ కొన్ని సూచనలు **అందజేస్తున్నది.**

ఈ సందర్భంలో తెలంగాణ ముఖ్యమంత్రి, గౌరవనీయులైన కే. చంద్రశేఖరరావుకు కృతజ్ఞతలను తెలియజేస్తూ,తెలంగాణ రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతన్నల పక్షాన మెట్ట భూములను సాగుచేస్తున్న పేద రైతన్నల భవిష్యత్తును సుస్థిరమైనదిగా తీర్చిదిద్దేందుకు వీలుగా ప్రయోజనకరమైన కొన్ని సూచనలు కూడా అందజేస్తూ డీడీఎస్ ఒక లేఖ రాసింది.
కొన్ని వారాల క్రితం ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ఎరువుల విషయంలో చేసిన ప్రకటన మాకు చాలా ఆందోళన కలిగించింది. మా భయాందోళనలకు ప్రధాన కారణం ఏమిటంటే  ప్రభుత్వం అందించే సాయం రసాయన ఎరువులకు మాత్రమే వర్తించవచ్చునని, అదే నిజమైతే ఎదురయ్యే పరిణమాలు చాలా భయంకరకంగా ఉంటాయనీ మాకు ఆందోళన కలిగింది -అని ఆ *లేఖలో డీడీఎస్ తెలియజేసింది.*

రాష్ట్రంలోని వ్యవసాయదారుల్లో దాదాపు 60-65 శాతం మంది సాగు నీటి సదుపాయాలు లేని భూముల్లోనే సేద్యం చేసుకుంటున్నారు. ఆ భూములు కూడా అంత సారవంతమైనవి కావు. అలాంటి భూసారం తక్కువగా ఉన్న నేలల్లో రసాయన ఎరువులను ఉపయోగించినట్లయితే అవి చౌడు భూములుగా వ్యవసాయానికి ఉపయోగంలేనివిగా మారిపోతాయి. ఇందుకు సరైన ఉదాహరణ పంజాబ్ రాష్ట్రమే. అక్కడి భూములన్నీ నిజానికి చాలా సారవంతమైనవి. మూడు దశాబ్దాల క్రితం అక్కడి భూముల్లో నాలుగు టన్నుల దిగుబడి సాధించేందుకు ఉపయోగించిన ఎరువులకు ఇప్పుడు అదే దిగుబడి సాధించేందుకు నాలుగు రెట్లు అధికంగా ఎరువులను ఉపయోగించవలసి వస్తోంది. ఈ దారుణ ఫలితాలను గమనించిన తర్వాత మన దేశంలో

రసాయన ఎరువులతో సేద్యానికి నాంది పలికిన ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త అయిన డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ కూడా రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా మానివేయాలని సూచించవలసి వచ్చింది. అత్యధికంగా సారవంతమైన పంజాబ్ భూముల్లోనే పరిస్థితి ఈ విధంగా మారిపోయినప్పుడు చాలా తక్కువ సారం ఉన్న తెలంగాణ నేలల్లో ఏం జరుగుతుందో మనం ఊహించుకోవచ్చు. –*అని ఆ లేఖలో డీడీఎస్ ఆందోళన వ్యక్తంచేసింది.*

అలాంటి భయాలను ముఖ్యమంత్రి టీఆర్ఎస్ ప్లీనరీ సమావేశాల వేదిక మీద తొలగించివేశారు. రైతుకు ప్రభుత్వం అందించే రూ. 4 వేల ఎకరాకు ఆర్థిక సహాయంతో అతనికి ఇష్టమైన ఎరువులను - అవి రసాయన ఎరువులే అయినా, పెరడులో సొంతంగా తయారుచేసుకున్న సేంద్రీయ ఎరువులే అయినా – నిరభ్యంతరంగా కొనుక్కోవచ్చునని ముఖ్యమంత్రి ఇచ్చిన స్పష్టీకరణ మా భయాలన్నిటినీ దూరం చేసి వేసింది. ఇది నిజంగా విప్లవాత్మకమైన నిర్ణయమే. అందువల్లే సేంద్రీయ సేద్యం చేస్తున్న రైతన్నల తరఫున డీడీఎస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నది.

ఇదే సమయంలో ముఖ్యమంత్రికి డీడీఎస్ సవినయంగా చేస్తున్న మరో విజ్ఞాపన ఏమిటంటే - మరో అడుగు ముందుకేసి, సేంద్రీయ సేద్యం చేపడుతున్న రైతాంగానికి మరింత ప్రభుత్వం మద్దతు అందించాలి. ఎందుకంటే, బంగారు తెలంగాణ కోసం నిరంతరం కృషిచేస్తున్నది వాళ్లే కనుక. భవిష్యత్ తరాల కోసం నేటి నేల తల్లిని సారవంతంగా నిలబెట్టేందుకు వారు నిర్విరామంగా కృషిచేస్తున్న వాస్తవాన్ని గుర్తించి ప్రభుత్వం ప్రకటించిన సహాయంలో కనీసం 25 శాతం రసాయనికేతర సేద్యగాళ్లకు అందేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

## మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం

నీతి అయోగ్ పాలకవర్గం ఏప్రిల్ 23న న్యూఢిల్లీలో నిర్వహించిన మూడో సమావేశంలో ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగంలో చేపట్టే కార్యకలాపాలతో అనుసంధానం చేస్తే మంచిదని సూచించారు. "ఈ విధంగాగ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలన్న *ముఖ్యమంత్రి ప్రతిపాదన అభినందనీయమైనది.* దాదాపు పది సంవత్సరాలుగా డీడీఎస్ ఈ విధమైన అనుసంధానం అవసరాన్ని గురించి నిర్విరామంగా పోరాడుతోంది. సాధారణంగా కలుపు తీయడానికి అయ్యే ఖర్చు రైతులకు పెనుభారంగా ఉంటుంది.రసాయనిక కలుపు నివారణ మందులను ఉపయోగించకుండా ప్రత్యేకించి సేంద్రీయ సేద్యం చేసే వాళ్లకి ఈ సమస్య మరీ ఎక్కువగా వేధిస్తూ ఉంటుంది. కొన్ని సందర్భాలలో ఎకరా పొలంలో కలుపు ఏరివేసేందుకు రూ. 5 వేల వరకూ ఖర్చు చేయవలసి ఉంటుంది. అలాంటి రైతన్నలకు ఉపాధి హామీ పథకం కింద మద్దతు లభిస్తే వారికి చాలా ఊరటనిస్తుంది. *ఈ రకంగా లభించే సహాయంతో* దాదాపు 40 శాతం వరకూ సాగు వ్యయం తగ్గుముఖం పడుతుంది.

*అదే విధంగా* ఎడ్లను ఉపయోగించి దుక్కి దున్నడానికి అయ్యే ఖర్చు కూడా ఆకాశానికి చేరింది. కొద్ది సంవత్సరాల క్రితం వరకూ రైతన్నలకు దున్నడం ఏ రకంగానూ సమస్యగా ఉండేది కాదు. కేవలం వెయ్యి రూపాయలకే ఎకరా భూమిని దున్నడం సాధ్యమయ్యేది. ఈ రోజుల్లో అదే ఎకరం పొలం దున్నడానికి మూడు వేల వరకూ ఖర్చు చేయవలసి వస్తోంది. ఓ మోస్తరు సాదా రైతన్నకు ఇది చాలా భారంగా మారిపోయింది. ఆ విధంగా మీరు ప్రతిపాదించినట్టుగా వ్యవసాయ రంగ అవసరాలకు, ఉపాధి హామీ పథకాన్ని జతచేసినట్లయితే అది నిజంగా రైతన్నలకు పెద్ద వరమే కాగలదు."

## క్రిమి సంహారకాల సమస్య

వ్యవసాయ కార్యకలాపాల్లో క్రిమి సంహారకాల వినియోగం వల్ల ఎదురవుతున్న దుష్ప్రభావం గురించి కూడా ఆ లేఖలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చింది. "అమెరికావంటి దేశాలతో పోలిస్తే మన దేశంలో రసాయనిక క్రిమి సంహారాల వాడకం 40 రెట్లు ఎక్కువగా ఉంటోంది. ఈ తరహా వాడకాన్ని తక్షణం అడ్డుకోవలసిన అవసరం ఉంది. ఎంత కష్టమైనా ఈ క్రిమి సంహారకాల వాడకాన్ని అడ్డుకుంటేనే ఆరోగ్య సంపదతో విలసిల్లే యువతకు ఆరోగ్యవంతమైన సారవంతమైన భూమిని వారసత్వ సంపదగా అందించడం సాధ్యమవుతుంది. గత కొన్ని సంవత్సరాల కాలంలో రసాయనేతర క్రిమిసంహారక ప్రత్యామ్నాయాలు వాడుకలోకి వచ్చాయి. అలాంటి వాటిలో పంచగవ్య, జీవామృతం, ఇంకా ఇతర మూలికలతో తయారు చేసిన క్రిమి సంహారకాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. వీటి ప్రత్యేకత ఏమిటంటే వీటిని రైతన్న లేదా రైతు మహిళ తన ఇంట్లోనే స్వయంగా సిద్ధం చేసుకోవడానికి అనువుగా ఉంటాయి. అంతేకాకుండా ఎక్కువ ఖర్చు చేయవలసిన అవసరం లేకుండానే, పంట భూములను సారవంతంగా రసాయన కాలుష్యానికి బలిచేయవలసిన దుస్థితి నుంచి వ్యవసాయదారుడు బయటపడగలుగుతాడు. తన పంటను చీడపీడలనుంచి, క్రిమికీటకాలనుంచి కాపాడుకోగలుగుతాడు. "

ఈ సందర్భంలో డీడీఎస్ తన లేఖలో ముఖ్యమంత్రికి మరో విజ్ఞప్తి కూడా చేసింది. పుడమి తల్లి గర్భంలో సహజంగా లభించే జీవజాలానికి హాని కలిగించని తమ సొంత జాగాలోనే బయో పెస్టిసైడ్లు, బయో ఎరువుల తయారీకి రైతు కుటుంబాలను ప్రోత్సహించేందుకు చర్యలను తీసుకోవాలని ముఖ్యమంత్రిని డీడీఎస్ అభ్యర్థిస్తోంది. అలా చేయడం వల్ల వారికి ఎంతో సొమ్ము ఆదా అవుతుంది. తెలంగాణ భూములను సారవంతమైన మాగాణీ భూములుగా సంరక్షించేందుకు సరైన పెట్టుబడి అవుతుంది.

## క్రాప్ కాలనీలపై పునరాలోచించాలి

చిన్న, సన్నకారు రైతన్నల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అభినందిస్తూనే ... క్రాప్ కాలనీ ప్రతిపాదనల వంటివి మాకు చాలా ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పకతప్పదు. ఇలాంటి ఆలోచనలు ఇటీవల కొద్ది వారాలుగా ప్రభుత్వపక్షం నుంచి

వినిపిస్తున్నాయి. ఈ రకమైన ప్రతిపాదనలు కాగితాల మీద చూసేందుకు చాలా ఆకర్షణీయంగానే కనిపిస్తాయి. అయితే వాస్తవంలోకి వచ్చే సరికి వాటి వల్ల ఊహించని దుష్పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా సన్న చిన్న కారు రైతులకు చాలా కష్టనష్టాలు తప్పవు. క్రాప్ కాలనీ ఆలోచన కారణంగా ఏక పంట విధానం అమలులోకి వస్తుంది. అంతేకాక, వ్యవసాయ సంబంధమైన జీవవైవిధ్యానికి తీరని హాని కలిగిస్తుంది. జీవవైవిధ్యం పంటలకు శ్రీ రామ రక్ష వంటిది. క్రిమికీటకాలనుంచి పంటలకు రక్షణ ఇస్తుంది. భూసారాన్ని పరిరక్షిస్తుంది. వ్యవసాయ జీవవైవిధ్యం అన్న ప్రాథమిక సూత్రం సగటు రైతన్న హృదయంలోనే కనిపిస్తుంది. అందువల్ల జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు మనం మన శక్తియుక్తులన్నిటినీ ఉపయోగించటం చాలా అవసరం. ఒకసారి ఏదైనా ప్రాంతాన్ని ఏదో ఒక పంటకు క్రాప్ కాలనీగా ప్రకటించిన తర్వాత, ఆయా ప్రాంతాల పాలనా యంత్రాంగం మరింత కష్టపడి అయినా సరే దానిని విస్తరింపచేసేందుకే దృష్టి కేంద్రీకరిస్తుంది. ఆ ఒక్క పంట సాగు చేసేందుకు తప్ప మరే పంట సాగును అనుమతించదు. ఇది చిన్న రైతుకు చాలా నష్టదాయకం. చిన్న, సన్నకారు రైతాంగం అన్ని వేళలా జీవవైవిధ్యం కాపాడుకునేందుకే అన్ని వేళలా ఆసక్తి చూపిస్తారు. ఈ జీవవైవిధ్యమే తమ భూములు సారవంతంగా నిలవడానికి సరైన కవచంగా వారు భావిస్తుంటారు. ఒక పంట నష్టపోయినా మరో పంట ద్వారా ఆ నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు జీవవైవిధ్యమే సరైన బీమా సదుపాయంగా వారు గట్టిగా విశ్వసిస్తారు. ఆ కారణంగా ఈ రకమైన కేంద్రీకృత వ్యవసాయం క్రాప్ కాలనీల పేరిట ప్రోత్సహించే యత్నాలు మానుకోవాలని, చిన్న రైతన్నల నమ్మకాన్ని గెలుచుకున్న జీవవైవిధ్య సూత్రానికి హాని కలిగించవద్దని కోరుతున్నాము.

## ముందు మార్గం

డీడీఎస్ రాసిన ఆ లేఖలో మరో విషయాన్ని కూడా గుర్తుచేసింది. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్ర స్థానంలో నిలపాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు మరిన్ని సాహసోపేతమైన పరిష్కార మార్గాల గురించి, చర్యల గురించి ఆలోచించాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసింది. ఇప్పటికే వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రానున్న రోజులలో ఈ సమస్య మరెన్నో సమస్యలకు దారి తీయనున్నది. ఈ పరిస్థితిలో రైతన్న మనుగడ సుస్థిర వ్యవసాయం దిశగాసాగుతూ, సాగు నీటి లోటు సమస్యను ఎదుర్కోకుండా ముందుకు  నిలకడగా సాగేందుకు అవసరమైన అడుగులు వేయాలని డీడీఎస్ తన లేఖలో ముఖ్యమంత్రికి సూచించింది.

## చిరుధాన్యాల రాష్ట్రంగా తెలంగాణ

రకరకాలైన చిరు ధాన్యాలు మన సంప్రదాయ పంటలు. తెలంగాణ భూముల్లో సజ్జలు, రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యాలు చాలా ముఖ్యమైనవి. అవి పోషక విలువల పరంగా కూడా చాలా విలువైనవి. మన ప్రాంత ప్రజలు ఎంతో వేడుకగా, ఉత్సాహంగా బోనాలు, బతుకమ్మ వంటి పండుగలు, పబ్బాలు జరుపుకోవడం మన ప్రాంతీయ ప్రజల జీవన విధానం. అవి మన తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకమైనవి. మరెక్కడా కనిపించనివి.

ఇలాంటి వేడుకలకు కీలకమైన చిరు ధాన్యాలనే ప్రభుత్వ పంటలుగా ప్రకటించి పాటించాలి. వాటి సాగుకే అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి. చిరు ధాన్యాల సాగు పేద కుటుంబాల పాలిట ఆరోగ్య శ్రీ అని చెప్పాలి. ఆడపడుచులకు తుష్టి, పుష్టిని సమకూర్చగలిగిన సమతుల ఆహారం. అన్ని రకాలైన వాతావరణ మార్పులను చిరు ధాన్యాల సాగు తట్టుకోగలుగుతుంది. ఒక రకంగా వాతావరణానికి అనుకూలమైన పంటగా చెప్పవచ్చు. వీటి సాగుకు అధిక మొత్తంలో నీరు అవసరం లేదు. రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలు అవసరం లేదు. జీవవైవిధ్యంతో కూడిన వాతావరణంలో కూడా సమృద్ధిగా దిగుబడినిస్తాయి. ఈ అంశాలను అన్నిటినీ పరిగణనలోకి తీసుకుని దిగువ సూచించిన రైతు అనుకూల చర్యలను చేపట్టవలసినదిగా తెలంగాణ ప్రభుత్వానికి డీడీఎస్ సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నది. :

ఎ) ఎకరాకు ఆరు లక్షల గ్యాలన్ల నీటి వినియోగాన్ని నివారించి నీటి ఆదాకు తోడ్పడే చిరు ధాన్యాల రైతన్నకు బోనస్ ప్రకటించాలి.

బి) తమ చిన్న చిన్న కమతాలలోనే జీవవైవిధ్య సంరక్షణ విధానాలను అనుసరిస్తున్న కారణంగా వారికి ప్రత్యేకంగా బయోడైవర్సిటీ బోనస్ ప్రకటించాలి.

సి) దేశంలోని పేద ప్రజానీకానికి అత్యున్నతమైన పోషక విలువలున్న ఆహారం అందజేసి వారిలోని పోషక లోపం తగ్గించి వాతావరణ మార్పుల ప్రమాదం నుంచి కాపాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యదానం చేస్తున్న కారణంగా వారికి పోషకవిలువల బోనస్ ప్రకటించాలి.

డి) వాతావరణ అనుకూల పంటలను సాగు చేస్తున్న కారణంగా వారికి పర్యావరణ రక్షణ బోనస్ ప్రకటించాలి.

సేంద్రీయ చిరుధాన్యాల రాష్ట్రంగా తెలంగాణను ప్రకటించి, దేశంలోనే మరెక్కడా కనిపించని ఉత్తమ విధానాలను అనుసరించాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వానికి డీడీఎస్ సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నది.

పీ.వీ. సతీశ్
డైరెక్టర్, దక్కన్ డెవలప్ మెంట్ సొసైటీ
నేషనల్ కన్వీనర్, భారతీయ చిరుధాన్యాల సమాఖ్య